క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా 11కేవీ కొహెడ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 9.30 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి రూ. లక్ష విరాళం

దిల్‌సుఖ్‌నగర్: ఖమ్మం రైల్వే డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న మైథిలీ దేవి తన తల్లి పాలురి త్రిభువన సుందరి దేవి స్మృత్యర్థం అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు బుధవారం లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ డబ్బుతో 2023 -24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ తదితర వస్తువులు కొనుగోలు చేయాలని ఆమె గృహం నిర్వాహకులకు సూచించారు. విద్యా గృహానికి రూ. లక్ష విరాళం ఇచ్చిన మైథిలీ దేవికి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

రెగ్యులరైజేషన్ పేరుతో దోపిడీ

బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి

హయత్‌నగర్: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లను నిర్మించుకున్న వారికి నామమాత్రపు ఫీజుతో క్రమబద్ధీకరిస్తామని 58, 59 జీఓలను తీసుకొచ్చిన ప్రభుత్వం వాటిని అడ్డుపెట్టుకుని పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తోందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. 58,59 జీఓలను సక్రమంగా అమలు చేయాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బుధవారం హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ... నోటిఫైడ్ స్లం ఏరియాలో కేవలం పది శాతం రుసుముతో క్రమబద్ధీకరణ చేయాలని జీఓలో ఉందన్నారు. అయినప్పటికీ మండలంలోని రంగనాయకులగుట్ట, వీరన్నగుట్ట, ముదిరాజ్‌కాలనీ, బంజారాకాలనీల్లో ఉంటున్న పేదలకు లక్షల రూపాయలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారన్నారు. జీఓ 58 కింద ఉచితంగా రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్ పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

ఐక్యతా ఫౌండేషన్ ఛైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: రాంనుంతల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ శ్వేత ఆనంద్ కూతురు శ్రీనిధి మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబాన్ని బుధవారం ఐక్యతా ఫౌండేషన్ ఛైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పరామర్శించారు. రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవడం వల్ల కుటుంబం పడే బాధను ఎవరూ తీర్చలేరని అన్నారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చకండి.. కని పెంచి చదివించి.. ప్రయోజకులయ్యే సమయంలో తనువు చాలిస్తే ఆ కుటుంబం పడే బాధ వర్ణనాతీతమని అన్నారు. ఏ సమస్య వచ్చినా కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఎదుర్కోవాలని.. అంతేకాని ప్రతి సమస్యకు చావు ఒక్కటే పరిష్కారం కాదన్నారు. ఆయన వెంట శ్రీరాములు, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ఆరోపణలు అవాస్తవం

ఉప సర్పంచ్ అనిల్

తలకొండపల్లి: ఆయుష్మాన్ భారత్‌లో ప్రజలను నమోదు చేయించడంలో బీజేపీ కార్యకర్తలు డబ్బులు తీసుకున్నారని ఓ ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ఆరోపణ చేయడం సిగ్గుచేటని నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఆరోపణలు చేసిన నాయకుల వద్ద రుజువులు ఉంటే బయటపెట్టాలని కోరారు. బీజేపీ కార్యకర్తల నిజాయితీని ఎదుర్కొనే దమ్ములేకనే ఇలాంటి పనికి మాలిన అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తల జోలికి వస్తే తగిన గుణపాఠం తప్పదన్నారు.

ఆదిబట్ల ఎస్‌ఐ లక్ష్మీనారాయణ బదిలీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ బదిలీ అయ్యారు. ఆదిబట్ల పీఎస్‌లో అడ్మిన్ ఎస్‌ఐగా పనిచేసిన ఆయన మూడు సంవత్సరాలు ఇక్కడ సేవలందించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాచకొండ పోలీస్ కమిషనర్ బుధవారం లక్ష్మీనారాయణను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ అయినట్లు సమాచారం.

ఇంటింటికి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: ఇంటింటికి సీపీఐ ముగింపు బహిరంగసభ వాల్‌పోస్టర్‌ను ఆ పార్టీ నేతలు బుధవారం ఇబ్రహీంపట్నంలో ఆవిష్కరించారు. ఈనెల 11న కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాములు, నాయకులు జంగయ్య, రవీంద్రాచారి, లక్ష్మయ్య, నర్సింహ, పర్వతాలు, మారయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

అర్హత ఉన్నా.. అందని ఆసరా!

- రేషన్ కార్డు లేక పేదలు పరేషాన్
- పింఛన్ల కోసం వృద్ధుల ఎదురుచూపు
- ఒంటరి జీవుల ఆందోళన
- పట్టించుకోని పాలకులు, అధికారులు

బడంగ్‌పేట్: 'పేరు పెద్ద. ఊరు దిబ్బలా' మారింది బడంగ్‌పేట పరిస్థితి. కార్పొరేషన్ పరిధి 32 డివిజన్లలో పింఛన్, రేషన్ కార్డుల కోసం అత్యధిక అర్హులు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. అర్హత ఉండి అర్జీ పెట్టుకొని మూడేళ్లు దాటినా పెన్షన్ అతీగతి లేదని, రేషన్ సరుకులకు దిక్కూమొక్కూ లేదని పలువురు వాపోతున్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్.. ఏటికేడు జనాభాతో పోటీ పడుతూ.. మహేశ్వరం నియోజకవర్గానికి గుండెకాయలా మారింది. కానీ.. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయసహకారాలు నెమ్మదించడంతో అర్హులు నిరుత్సాహం వ్యక్తంచేస్తున్నారు.

బాధితులు కన్నీటి పర్యంతం

భర్తను కోల్పోయి భార్య, భార్యను కోల్పోయి భర్త, ఒంటరి జీవులు, వృద్ధాప్యంతో బాధపడుతూ సర్కారు సాయం కోసం ఎదురు చూస్తున్న వారు కార్పొరేషన్ పరిధిలో ఎంతో మంది ఉన్నారు. అందులో 3 వేలకు పైగా వృద్ధాప్య పింఛన్లు, 2 వందలకు పైగా విడో, 5 వేలకు పైగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఉన్నట్లు అధికారిక సమాచారం. రేషన్ కార్డు సంగతి ఎలా ఉన్నా.. ఒంటరి జీవితం, విడో పింఛన్ల కోసం కాలికి బలపం కట్టుకొని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎవరూ కరుణించడం లేదని పలువురు బాధితులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఇంటి పెద్ద కాలం చేసి మూడేళ్లు దాటి, పింఛన్ కోసమని దరఖాస్తు పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బడంగ్‌పేట కార్పొరేషన్ కార్యాలయం భవనం

రేషన్‌కు నోచుకోని బతుకులాయే!

నాలుగేళ్ల క్రితం రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటే ఇంత వరకు రాలేదని అనేక మంది వాపోతున్నారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయనుకున్నామని, కానీ కనీసం రేషన్ కార్డుకు నోచుకోని విధంగా దిగజారుతాయని అనుకోలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. తెలంగాణ వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయిందని రోజుకో పండుగ చేసుకుంటున్న ఈ ప్రభుత్వానికి.. మాలాంటి వారి బతుకులు కానరావడం లేదా అని ఒంటరి జీవులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సబంధిత అధికారులు, పాలకులు స్పందించి పింఛన్లు, ఆహార భద్రత కార్డు అర్హులకు అందజేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

మూడేళ్లయినా మోక్షం లేదు



కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎవరైనా చనిపోయినా, రేషన్ కార్డు లేకపోయినా, వృద్ధాప్యంలో ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే నెల రోజుల్లో పింఛన్, కార్డు మంజూరయ్యేది. కానీ.. ఇప్పుడు అది సాధ్యం కావడం లేదు. కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వడం లేదు. మా డివిజన్‌లో 3 వందలకు పైగా వికలాంగులు, విడోలు, వృద్ధులు ఉన్నారు. వారిని గుర్తించడం లేదు. వీరందరితో కలిసి త్వరలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

– ఎర్ర మహేశ్వరి, కార్పొరేటర్ బాలాపూర్

ఇళ్ల స్థలాలు కేటాయించండి

సర్పంచ్‌కు లబ్ధిదారుల వినతి

కందుకూరు: 2007లో ఇళ్ల స్థలాలు ఇచ్చి నేటికీ కబ్జా చూపలేదని వెంటనే స్థలాలు కేటాయించాలని లబ్ధిదారులు సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని అక్బర్‌జా రెవెన్యూ పరిధిలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాడగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 170 మందికి ఇళ్ల స్థలాలు పట్టాలు అందజేసి కబ్జా చూపలేదు. దీంతో బుధవారం సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి అంకగళ్ల కుమార్ ఆధ్వర్యంలో నేదునూరు సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి బుడ్డీరపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలకోసం అన్ని జిల్లాల్లో నిరుపేదల పక్షాన పోరాటాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా పేదలకు ఇళ్ల/ స్థలాలు కేటాయించి పేదల ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్, ఎ.భిక్షపతి, జి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

మేయర్ దుర్గ

మీర్‌పేట: సీఎం కేసీఆర్ పేదల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ సూచించారు. బుధవారం ఆమె 16వ డివిజన్ శ్రీసాయి కృపానగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ ఎ.అనిల్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, కార్పొరేటర్ సిద్దాల బీరప్ప, బీఆర్‌ఎస్ నాయకులు సుదర్శన, నర్సింహారెడ్డి, భూపేష్‌గౌడ్, కాలనీల అధ్యక్షుడు ఆకుల హరీశ్, చంద్రునాయక్, శ్రీధర్‌రెడ్డి, రమణ, రాజు, కాశీనాథ్, కైలాసం, మధు తదితరులు పాల్గొన్నారు.



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న మేయర్, కార్పొరేటర్

ఎంపీ రంజిత్‌రెడ్డికి వీధివ్యాపారుల కృతజ్ఞతలు

ఎండలతో ఇబ్బంది పడుతున్న వీధి వ్యాపారులకు చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1500 గొడుగులు పంపిణీ చేశారు. బుధవారం ఫౌండేషన్ సభ్యులు మీర్‌పేట్ కార్పొరేషన్, బాలాపూర్ క్రాస్ రోడ్డులో వీధి వ్యాపారులకు ఈ గొడుగులు అందజేశారు. ఈ సందర్భంగా వారు రంజిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

– బడంగ్‌పేట



ఎస్‌ఎన్‌డీపీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న అబ్దుల్లా సాధి

పహాడీషరీఫ్: ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేసి నబీల్ కాలనీలో వర్షాకాలంలో త్వరితగతిన వరద సమస్య లేకుండా చూస్తామని జల్‌పల్లి మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్లా సాధి తెలిపారు. 3వ వార్డులో రూ.3.25కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఎస్ఎన్‌డీపీ పనులను బుధవారం ఆయన కౌన్సిలర్ అహ్మద్ కసాదితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి కృషితో నబీల్ కాలనీ, మెట్రోసిటీ, డ్రీమ్ సిటీలలో రూ.10 కోట్లతో వ్యూహాత్మక నాలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే మెజార్టీ పనులు పూర్తి కాగా.. మిగిలిన కొద్దిపాటి దూరాన్ని కూడా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ జాఫర్ బామ్ నాయకులు యూనుస్, ఖాలీద్, షోయబ్, అబ్దుల్ అజీజ్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వార పనులు ప్రారంభం

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం వేణుగోపాల స్వామి ఆలయ ముఖద్వార పనులను గ్రామ సర్పంచ్ సులోచన సాయిలు బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర గల ఈ ఆలయ విశిష్టతను తెలిపే విధంగా నాలుగు మాసాల్లో ఆలయ ముఖద్వార పనులు పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణేశ్, నాయకులు శ్రీకాంత్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

మేమున్నామని..

తలకొండపల్లి: తమతో పాటు వెల్జాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(1993-94 ఎస్ఎస్‌సీ బ్యాచ్) చదువుకున్న తోటి మిత్రుడు నర్సింహులు 19 సంవత్సరాల క్రితం చనిపోయాడు. అతని కూతురు వివాహం బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగింది. ఈ సందర్భంగా మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు అతడి బ్యాచ్ మెట్స్. అందరూ కలిసి నర్సింహులు కూతురు వివాహానికి కానుకగా రూ.61,021 పెళ్లి మండపంలో అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు ఉప సర్పంచ్ అజీజ్, మంజుల, శంకర్‌గౌడ్, రాములమ్మ, కృష్ణయ్య, ఎల్లయ్య, చంద్రమౌళి, రాజేందర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, శేఖర్‌గౌడ్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి

తలకొండపల్లి: ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సర్పంచ్ స్వప్న అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఏ-విటమిన్ సిరప్ అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన సర్పంచ్.. చిన్నారులకు సిరప్ తాపించారు. అనంతరం చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. గర్భిణులకు గుడ్లు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ అనంతమ్మ, కార్యదర్శి చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, ఆశ వర్కర్లు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మ్యాన్‌హోల్ మరమ్మతులు చేయిస్తున్న శివకుమార్

బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్

తుక్కుగూడ: వార్డుల్లోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తుక్కుగూడ మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ వై.శివకుమార్ అన్నారు. బుధవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డులో మరమ్మతులకు గురైన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మీకు అండగా ఉంటా



గుంటి జంగయ్యనగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- బస్తీలో ఒక్క ఇటుక కూలకుండా చూసుకుంటా
- గుంటి జంగయ్యనగర్ బస్తీవాసులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్ బస్తీవాసులకు అండగా ఉంటామని, బస్తీలో ఒక్క ఇటుక కూడా కూలకుండా చూసుకునే బాధ్యత తనదేనని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బస్తీవాసులకు హామీ ఇచ్చారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్ బస్తీలో స్థానికుల కోరిక మేరకు ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ, తమ ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం జీఓ 58, 59 కింద దరఖాస్తు చేసుకున్నామని, అయితే 59 జీఓ కింద నమోదు చేసుకున్న వారు అధిక రుసుము కట్టాల్సి వస్తోందన్నారు. అలాగే 58 జీఓ కింద దరఖాస్తు చేసుకున్న వారిని కూడా అధికారులు 59 జీఓ కిందకు తీసుకొస్తున్నారని చెప్పారు. తమ ఇళ్లను కూలగొడతారంటూ కొందరు ప్రచారం చేస్తూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 59 జీఓ కింద నమోదు చేసుకున్న వారు అధిక రుసుము కట్టాల్సి రావడంతో బస్తీవాసులతో కలిసి రెండు నెలల క్రితమే కలెక్టర్‌ను కలిశామని, అధిక రుసుము వచ్చిన వారికి తక్కువ వచ్చేలా ప్రతిపాదనలు చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. 59 జీఓలో వద్దనుకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే 58 జీఓలో నమోదు చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని రాద్ధాంతం చేస్తూ ఇళ్లను కూలగొడతారని బస్తీవాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. నేను మీకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, నాయకులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, ఖైసర్, దశరథ్, ప్రకాష్, రవి నాయక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పండుగకు చెరువు ముస్తాబు



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్ద లైటింగ్ పనులు

ఇబ్రహీంపట్నం: ఊరూరా చెరువుల పండుగకు ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ముస్తాబయింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లోని చెరువుల వద్ద పారిశుధ్య పనులతో పాటు విద్యుత్ దీపాలను అలంకరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు తూము వద్ద ఉన్న నిర్మాణానికి విద్యుత్ లైట్లతో అందంగా ముస్తాబు చేశారు. కట్టపై గల రోడ్డు వెంట వీధిలైట్లను అమర్చారు. ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం

మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు పరిరక్షణ అంశంపై హైకోర్టు తీర్పు హర్షణీయమని తుర్కయంజాల్ మాసబ్ చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేష్, ఉపాధ్యక్షుడు కిషన్ అన్నారు. చెరువులో ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చూడటంతో పాటు మట్టిని డంప్ చేయవద్దని పేర్కొంటూ ఈనెల 6న హైకోర్టు స్టేటస్-కో విధించిన విషయం తెలిసిందే. బుధవారం తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ.. గీత కొన్నిరోజులుగా పోరాటం చేస్తున్నా.. కోర్టు ఉత్తర్వుల ఏవంటూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని.. అలాంటి అధికారులకు కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని అన్నారు. చెరువులోని అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు చెరువు హద్దులను ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. చెరువు పరిరక్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి ఐలయ్య, ఉపాధ్యక్షులు కల్యాణ్ నాయక్, యాదిరెడ్డి, ముఖ్య సలహాదారుడు అరుణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి శంకరగిరి మాన్యాలే దిక్కు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీకి శంకరగిరి మాన్యాలే దిక్కని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ తలకిందులుగా యాత్రలు చేసిన ప్రజలు వారిని నమ్మేస్థితిలో లేరన్నారు. డిమోనిటైజేషన్, జీఎస్టీతో ప్రజలకు ఏం లాభం చేకూరిందో ప్రధాని దేశ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లపై లైంగికదాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీపై చట్టపరంగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్న బీజేపీ నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రంలో ప్రజాసంగ్రామ యాత్ర, ప్రజాగోస యాత్ర అని ఎన్ని యాత్రలు చేసినా బీజేపీని ప్రజలు విశ్వసించరని అన్నారు. ఆంధ్రపాలకులకు మంగళహారతి పట్టిన డీకే అరుణ.. సీఎం కేసీఆర్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. కులమతాల మధ్య చిచ్చుపెడుతూ దేశంలో అరాచక పాలన సాగిస్తున్న బీజేపీకి ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తాచాటుతామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పత్యానాయక్, కుమార్, రమేశ్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్